క్లుప్తంగా

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి


యుగంధర్, సీఐ

ప్రొద్దుటూరు క్రైం : శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని టూ టౌన్ సీఐగా యం. యుగంధర్ తెలిపారు. బుధవారం టూ టౌన్ సీఐగా ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ప్రొద్దుటూరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న ఆయనను ఉన్నతాధికారులు టూ టౌన్‌కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మట్లాడుతూ సమస్య వచ్చినప్పుడు ప్రజలు నేరుగా స్టేషన్‌కు రావాలని సూచించారు. ట్రాఫిక్ సీఐగా రెండేళ్ల పైగా ఇక్కడే పని చేయడంతో ఈ ప్రాంత సమస్యలు, స్థితిగతులపై అవగాహన ఉందని సీఐ తెలిపారు.

చెట్లు మానవాళికి మెట్లు


ప్రభలవీడు సచివాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం

బి.కోడూరు : చెట్లు మానవాళికి మెట్లు అని వాటర్‌షెడ్ చైర్మన్ కె.వెంకటసాయికృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ప్రభలవీడులో మాజీ సర్పంచ్ రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో తిప్పరాజుపల్లె, ప్రభలవీడు గ్రామాల్లోని రహదారుల వెంట, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ సచివాలయాల ఆవరణలో మొక్కలు నాటారు. మొక్కల వలన మానవాళికి కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, నాయకులు శేషారెడ్డి, సిద్దారెడ్డి, సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇటుకలు మీద పడి బేల్దారి మృతి


మృతి చెందిన విశ్వనాథ్

ప్రొద్దుటూరు క్రైం : ఇంటి నిర్మాణ పని జరుగుతుండగా ఇటుకలు మీద పడటంతో పల్లా విశ్వనాథ్ (46) అనే బేల్దారి మృతి చెందిన ఘటన ప్రొద్దుటూరులోని మౌలానా ఆజాద్ వీధిలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు రామేశ్వరం బైపాస్ రోడ్డులో నివాసం ఉంటున్న పల్లా విశ్వనాథ్ బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అతనికి భార్య దేవీతో పాటు తరుణ్ అనే కుమారుడు ఉన్నారు. విశ్వనాథ్ బుధవారం ఉదయం బేల్దారి పని నిమిత్తం మౌలానా ఆజాద్ వీధి-3 కి వెళ్లాడు. ఇంటి నిర్మాణ పనిలో భాగంగా యంత్రం ద్వారా భవనంపైకి ఇటుకలను తరలిస్తుండగా కొన్ని ఇటుకలు కింద పడిపోయాయి. దీంతో అక్కడే ఉన్న విశ్వనాథ్, సురేంద్రకు గాయాలు అయ్యాయి. గాయపడిన ఇరువురిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. తలకు గాయమై తీవ్రంగా గాయపడిన విశ్వనాథ్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్ తెలిపారు.

ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యం


మాట్లాడుతున్న పోతిరెడ్డి భాస్కర్

మైదుకూరు : ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని సీపీఐ అనుబంధ ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్ ఆరోపించారు. బుధవారం మైదుకూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బ్రిటిష్ వారిని వెళ్లగొట్టేందుకు స్వాతంత్య్ర సమరయోధులు క్విట్ ఇండియా పేరుతో ఉద్యమాన్ని నడిపారని గుర్తుచేశారు. నేడు పాలక ప్రభుత్వాల ప్రోత్సాహంతో కార్పొరేట్ శక్తులు సంపదను కొల్లగొడుతూ దేశంలోని రైతులు, కార్మికుల, వ్యవసాయ కార్మికులు, పేదలు, మధ్య తరగతి ప్రజలకు అన్యాయం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. అందుకే ఆగస్టు 9న కడపలో కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా క్విట్ కార్పొరేట్ పేరుతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంయుక్త కిసాన్ మోర్చా, వామపక్ష కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాల, జాతీయ సమితుల పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ నిరసనలో రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అర్హులకు న్యాయం చేయాలి

పోరుమామిళ్ల: కడప మేత్రాసనము ఆర్‌సీఎం మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలల్లో ఎయిడెడ్ పోస్టులను నిబంధనల మేరకే భర్తీ చేస్తారని కేవీపీఎస్ మండల కార్యదర్శి సుందరయ్య తెలిపారు. మంగళవారం రాత్రి అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎయిడెడ్ పోస్టు దక్కించుకునేందుకు కొంతమంది స్వార్థంతో వారి కుటుంబసభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని భయపెడుతూ, బ్లాక్ మెయిల్ చేస్తూ ఆర్‌సీఎం మేనేజ్‌మెంట్‌ను బెదిరిస్తున్నారని ఆరోపించారు. టీచర్ల నియామక ప్రక్రియలో మేనేజ్‌మెంట్‌కు సహకరిస్తామని తెలిపారు. అర్హత కలిగిన వారికి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో రవి, రత్నం, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధి.. దిగుబడి వృద్ధి

పంటల సాగులో విత్తనశుద్ధి కీలకం. భూమిని దున్నటం ఎంత ముఖ్యమో శుద్ధి చేసి విత్తనం వాడటం అంతే ప్రధానం. విత్తనశుద్ధితో మొలక శాతం కూడా పెరుగుతుంది. తొలి దశలో ఆశించే పురుగులు, తెగుళ్ల బారి నుంచి పంటలను కాపాడుకోవచ్చు. చీడపీడల ఉధృతిని తగ్గించి తర్వాత దశలో ఆశించే రసం పీల్చే పురుగులు, వైరస్‌ల నుంచి పంటలను కాపాడుకోవచ్చు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

- తెగుళ్ల నుంచి పంటలకు రక్షణ
- విత్తన శుద్ధితో ప్రయోజనాలు అధికం
- తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి



చాపాడు : వ్యవసాయంలో అధిక దిగుబడులు రావాలంటే విత్తన శుద్ధి, సాగులో మెళకువలు తప్పని సరిగా పాటించాలని మండల వ్యవసాయాధికారులు చెబుతున్నారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు కావటం వలన ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సబ్సిడీ విత్తనాలు ఇప్పటికే పంపిణీ చేశారు. ప్రభుత్వ సాయంతో పాటు మెళకువలను పాటిస్తే వ్యవసాయం లాభసాటిగా ఉంటుంది. ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులు విత్తన శుద్ధి చేపట్టాలి. ఇప్పటికే మైదుకూరు నియోజకవర్గంలోని కేసీ కాలువల్లో సాగునీరు పారుతోంది. ఇదే క్రమంలో కుందూనదికి వరద నీరు సంవృద్ధిగా వస్తోంది. దీంతో ఈ ఏడాది కేసీ, కుందూనది పరివాహంలో 50 వేల ఎకరాల్లో వరి సాగు చేసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. నియోజకవర్గంలో వారం రోజులుగా రైతులు సాగుకు సమాయత్తమవుతున్నారు. వరి సాగు చేసే రైతులు విత్తన శుద్ధి పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

సూచనలు పాటిస్తే అధిక దిగుబడి



రైతులంతా శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తే వ్యవసాయం లాభసాటిగా మారుతుంది. ప్రస్తుతం రైతులకు కావాల్సిన విత్తనలు, ఎరువులు, పురుగు మందులు రైతు భరోసా కేంద్రాల నుంచే అందుతాయి. రైతులు మట్టి పరీక్షలు నిర్వహించి వాటిని అనుగుణంగా ఎరువులు వేసుకుంటే దిగుబడులు సాధించవచ్చు. రైతు భరోసా కేంద్రాల ద్వారా అందే సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

-ఇమ్మాగి, మండల వ్యవసాయాధికారి, చాపాడు

విత్తన శుద్ధి విధానం

- కిలో విత్తనానికి గ్రాము కార్బండిజమ్ లేదా 2.5 గ్రాముల మాంకోజబ్ కలిసి విత్తనశుద్ధి చేసుకోవాలి.
- విత్తన శుద్ధిలో తగిన మోతాదులో మందులు వాడాలి.
- మోతాదుకు మించితే విత్తనం మొలకశాతం దెబ్బతింటుంది.
- శిలింద్రనాశిని పురుగుల మందుతో శుద్ధి చేసిన జీవరసాయనాలతో మరోసారి శుద్ధి చేయాలి.
- గింజ పగులకుండా, పై పొర పోకుండా జాగ్రత్త తీసుకోవాలి.
- శుద్ధి చేసేటప్పుడు చేతులకు గ్లౌజులు, ముఖానికి గుడ్డకట్టుకోవాలి.

ప్రయోజనాలు

- నేల ద్వారా వ్యాపించే తెగుళ్ల పురుగులను సమర్థవంతంగా నివారించటానికి దోహదపడుతుంది.
- శుద్ధికి వినియోగించే మందులు విత్తనంలోకి చొచ్చుకుపోయి శిలింద్రాలను నాశనం చేస్తాయి.
- మొలకెత్తిన లేత మొక్కలు నేలలో ఉన్న శిలింద్రాల నుంచి రక్షణ పొందుతాయి
- తక్కువ ఖర్చుతో పురుగు, తెగుళ్ల పంటను ఆశించకుండా చెయొచ్చు.

జన వాక్కు



ఇంటింటికి రేషన్‌ను అందించాలనే లక్ష్యంతో వైఎస్ జగన్ తన పాలనలో ఎండీయూ వాహనాలను ఏర్పాటు చేశారు. పల్లెల్లో, పట్టణాల్లో ఈ వ్యవస్థ ప్రజలకు చాలా ఉపయోగంగా ఉంది. ప్రస్తుత సీఎం చంద్రబాబు వాహనాలను తొలగిస్తే దూరంగా ఉన్న రేషన్ షాపులకు వెళ్లి రేషన్ తెచ్చుకోవడం సమస్య అవుతుంది. యథావిధిగా వ్యవస్థను కొనసాగించాలి.

పేదలకు తీరని నష్టం



ముఖ్యంగా పేదల కోసమే ప్రభుత్వం ప్రతి నెల రేషన్ అందిస్తోంది. ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ ఇవ్వడం వల్ల ఇంటి దగ్గరే లబ్ధిదారులు తీసుకుంటున్నారు. రేషన్ షాప్‌కు వెళ్లి క్యూలో నిల్చోవడం, తెచ్చుకోవడం ఇబ్బంది. కూలి పనులకు వెళ్లే వారు ఎక్కువగా నష్టపోతారు. కొంత మంది తీసుకురాలేక డీలర్‌కే అమ్ముకోవడమా.. లేక ఆటో చార్జీలు పెట్టి తెచ్చుకోవడమా జరుగుతుంది.

- బంకా లక్ష్మిరెడ్డి, ప్రొద్దుటూరు

డీలర్ల కోసమే ప్రభుత్వం ఇలా చేస్తోంది



టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో రేషన్ డీలర్లను తొలగించి తమ కార్యకర్తలకు ఇచ్చారు. ఇప్పటికే కొన్ని చోట్ల దౌర్జన్యంగా, రేషన్ షాప్‌ల్లోనే రేషన్ ఇస్తున్నారు. ఇంటింటికి రేషన్ అందిస్తున్న మొబైల్ డిస్పెన్సరీ యూనిట్ (ఎండీయూ)లను తొలగిస్తే ప్రజలు ఆందోళన చేసే పరిస్థితి ఉంటుంది. వాహనాలను తొలగిస్తే కేవలం డీలర్లకే ఉపయోగం.

- సుభాన్ బాషా, ప్రొద్దుటూరు

ఆరోగ్యకరమైన పంటలపై మొగ్గు

అట్లూరు : రైతులు పురుగు మందుల వాడకం తగ్గించి ఆరోగ్యకరమైన పంటలు పండించేందుకు మొగ్గు చూపాలని బద్వేలు వ్యవసాయ డివిజన్ సహాయ సంచాలకులు ఎం.నాగరాజు పేర్కొన్నారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా బద్వేలు మండల పరిధిలోని చింతలచెరువు గ్రామంలో బుధవారం రైతులతో కలసి పొలాలల్లో పర్యటించారు. అనంతరం ఆరోగ్యకర పంటలు పెంపకం, మిత్ర పురుగుల రక్షణ, జీవామృతం తయారీ, వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.చంద్రమోహన్‌రెడ్డి, చింతలచెరువు రైతు సేవా కేంద్రం సహాయకుల పవణ్‌కుమార్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జంగయ్య, నాగిరెడ్డి, మమత, నారిబోయిన విజయశేఖర్, రైతులు పాల్గొన్నారు.


రైతులకు సూచలిస్తున్న వ్యవసాయశాఖాధికారులు

ప్రభుత్వ భూములు పేదలకు పంచాలి


ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

అట్లూరు : నల్లాయపల్లి రెవెన్యూ పొలంలోని ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలని అట్లూరు తహసీల్దారు కార్యాలయం ఎదుట వ్యాసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్ మాట్లాడుతూ నల్లాయపల్లి రెవెన్యూ పొలంలో సుమారు 500 ఎకరాలు ప్రభుత్వ భూమి పలువురు నాయకులు ఆక్రమిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని కోరారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దారు రవిశంకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దుర్గమ్మ, రవణమ్మ, సుభద్రమ్మ, మాధవి, పార్వతి పాల్గొన్నారు.

కాశినాయన : మండలంలోని అక్కెంగుండ్ల రెవెన్యూ పొలంలో హైదరాబాద్‌కు చెందిన కొందరు బినామీ పేర్లతో చేయించుకున్న పట్టాలను రద్దు చేసి పేదలకు న్యాయం చేయాలని సీపీఎం పార్టీ మండల కన్వీనర్ పోలయ్య బుధవారం తహసీల్దారు బాలనరసింహులుకు వినతిపత్రం అందజేశారు. పొలాలను పరిశీలించి సాగులో ఉన్న పేదలకే పట్టాలు అందించాలని తహసీల్దారును కోరారు.

చేనేతపై కేంద్రం కాఠిన్యం


తహసీల్దార్ గంగయ్యకు వినతి పత్రం ఇస్తున్న దశరథరామయ్య

ప్రొద్దుటూరు : దేశంలో వ్యవసాయం తరువాత ఎక్కువ మందికి ఉపాధి చూపిస్తున్న చేనేత రంగాన్ని ఎన్డీఏ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని స్వర్ణభారత్ ప్రజా పార్టీ వ్యవస్థాపకుడు శిలివేరు దశరథ రామయ్య ఆరోపించారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద చేనేత కార్మికులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 12 ఏళ్లుగా నేతన్నలకు ముడి సరుకుల కొనుగోలుపై ఆర్థిక సహాయం అందించారని తెలిపారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక ఇంత వరకు చేనేత కార్మికుల ఆర్థిక సహాయంపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం విచారకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేనేత కార్మిక రంగం గురించి ఒక్క మాట కూడా మాట్లాడలేదని విమర్శించారు. దేశ వ్యాప్తంగా సుమారు కోటి కుటుంబాలు వస్త్రాల తయారీలో ఉన్నాయని, అంతటి ప్రాధాన్యత గల ఈ వ్యవస్థ గురించి బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం సరికాదని తప్పుబట్టారు. చేనేత కార్మికుల గురించి మాట్లాడేవారు చట్ట సభల్లో లేరని వాపోయారు. 1996 నుంచి 2006 వరకు రాష్ట్రంలో 816 మంది చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. అనంతరం తహసీల్దార్ గంగయ్యకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి లోకేశ్వరి, రిటైర్డు తహసీల్దార్ నాగమల్లన్న, ఆడిటర్ వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయాలను నివారించాలి


గోపవరంలో ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తున్న ఎస్‌ఈ రమణ

గోపవరం : విద్యుత్ అంతరాయాలను పూర్తిగా నివారించాలని ఉమ్మడి వైఎస్సార్ జిల్లా విద్యుత్‌శాఖ ఎస్‌ఈ ఎస్.రమణ ఆదేశించారు. బుధవారం మండలంలోని 33/11 కె.వి., గానుగపెంట సబ్‌స్టేషన్ తదితర ప్రాంతాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను, విద్యుత్ లైన్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. అనంతరం గోపవరం, బద్వేలు, అట్లూరు, బ్రహ్మంగారిమఠం మండలాలకు సంబంధించి అధికారులు, సిబ్బందితో స్థానిక కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక శాతం విద్యుత్ ప్రమాదాలు నిర్లక్ష్యంతోనే జరుగుతున్నాయని, ప్రజలు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రమాదాలు నివారించాలన్నారు. విద్యుత్ పనులు చేసేటప్పుడు విధిగా సిబ్బంది భద్రతా నియమాలు పాటించాలని హెచ్చరించారు. వ్యవసాయానికి సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్ల ఫీజులు వేయడం, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను మార్చడం తదితర పనులపై వెంటనే స్పందించాలని సిబ్బందిని ఆదేశించారు. లోఓల్టేజీ సమస్యలు తలెత్తకుండా అవసరమైన కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామాల్లో పగటిపూట వీధిలైట్లు వెలగకుండా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా వీధిలైట్లు వెలుగుతున్నాయని తన దృష్టికి వస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. సమావేశంలో మైదుకూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ భరణికృష్ణ, ఏఏఈ శివకుమార్, డీఈ కుళాయప్ప, ఏఈలు విజయకుమార్, చిన్నయ్య, రమణ, జెఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాడాలి


బీపీమండల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బద్వేలు అర్బన్ : బీసీలంతా హక్కుల కోసం పోరాడాలని మండల్ ఆశయ సాధన సమితి కన్వీనర్ కె.రమేష్‌యాదవ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి బి.గురుమూర్తి పిలుపునిచ్చారు. మండల్ డే సందర్భంగా బుధవారం మండల్ ఆశయసాధన సమితి, బీసీ భవన్ సాధన సమితి ఆధ్వర్యంలో స్థానిక సిద్దవటం రోడ్డులోని పూలే సర్కిల్‌లో బీపీమండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీపీమండల్ చేసిన కృషి ఫలితంగానే రిజర్వేషన్ల ప్రక్రియ అమలులోకి వచ్చిందని గుర్తుచేశారు. అయితే మండల్ కమిషన్ నివేదికలోని 39 సిఫార్సుల అమలు కోసం ప్రతి ఏటా ఆగస్టు 7న మండల్ డే జరుపుకుంటున్నారని తెలిపారు. బీసీ భవన్ సాధన సమితి అధ్యక్షులు రమణయ్య, నాయకులు బాలచెన్నయ్య, బాలరాజు, ఉంటానరసింహులు, కత్తిబ్రహ్మయ్య, శ్రీనివాసులు, ఎం.బి.కె.సాగర్, రామసుబ్బయ్య పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఎమ్మెల్యే డాక్టర్ సుధ


హాజరైన వార్డు కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పట్టణంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. స్థానిక ఎన్‌జీవోకాలనీలోని మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో బుధవారం మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ పట్టణంలోని చాలా వార్డుల్లో పారిశుద్ధ్య సమస్య వేధిస్తోందని, తక్షణమే ఆయా వార్డుల్లో మురుగు కాలువలు శుభ్రం చేయించి, వ్యర్థాలు లేకుండా తొలగించాలని ఆదేశించారు. అలాగే పట్టణంలో వీధికుక్కల బెడద ఎక్కువగా ఉందని, కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

విధుల్లో అలసత్వం వహించే సిబ్బందిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో పారిశుద్ధ్య పనుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే స్థానిక మైదుకూరు రోడ్డులోని పాత గుంతపల్లె పంచాయతీ కార్యాలయం స్థలంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోలు బంకు ప్రారంభోత్సవాన్ని ఇన్ని దఫాలుగా ఎందుకు వాయిదా వేస్తున్నారని మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. మున్సిపల్ అధికారుల తీరుతో పురపాలక సంఘానికి రూ.8 లక్షలు నష్టం వాటిల్లిందని తెలిపారు. ఇందుకు స్పందించిన మున్సిపల్ కమిషనర్ ఈ నెల 15న పెట్రోలు బంకును ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే భావనారాయణనగర్ సచివాలయాన్ని స్థానిక కౌన్సిలర్‌కు సమాచారం లేకుండా ఎలా మారుస్తారని అధికారులను నిలదీశారు

గళమెత్తిన కౌన్సిలర్లు

వార్డుల్లో నెలకొన్న సమస్యలను కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. స్థానిక ఎన్‌జీవో కాలనీలో రూ.2 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తున్నారని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని 21వ వార్డు కౌన్సిలర్ ఓబుల్ రెడ్డి తెలిపారు. స్పందించిన కమిషనర్ .. టౌన్‌ప్లానింగ్ అధికారులు వెళ్లి అక్రమ కట్టడాలను నిలుపుదల చేయాలని ఆదేశించారు. నెల్లూరు రోడ్డులోని హిందూ శ్మశానవాటికలో వ్యర్థాలు వేస్తున్నారని, దీనిని నివారించాలని వైఎస్సార్‌సీపీ కో ఆప్షన్ మెంబర్ రామచంద్రారెడ్డి సమావేశం దృష్టికి తీసుకురాగా వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను కమిషనర్ ఆదేశించారు. అనంతరం అజెండాలోని అంశాలపై చర్చించి ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి, మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, డీఈ సుమన్‌రెడ్డి, గోపవరం తహసీల్దారు ఉదయభారతి, బద్వేలు డిప్యూటీ తహసీల్దారు మనోహర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ ఏఈలు, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

సీబీఐటీ విద్యార్థుల సత్తా

చాపాడు : స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ టెక్నాలజీ(సీబీఐటీ) కాలేజీలో 2023-24 విద్యా సంవత్సరం అటానమస్ బ్యాచ్‌కు చెందిన ఇంజినీరింగ్ ఫస్టియర్ సెకెండ్ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు చైర్మన్ డా.వి.జయచంద్రారెడ్డి తెలిపారు. సీఎస్‌సీ ఏఈఎమ్ఎల్ విభాగంలో పి.వైష్ణవి ప్రియ 9.23, దీక్షిత 9.18, షేక్ షాహిర్ 8.95, సీఎస్‌సీ విభాగంలో కె.భావన 9.71, కె.లక్ష్మీదివ్య 9.71, ఎం.యశ్వంత్ 9.71, ఈసీఈలో కె.స్వాతి 9.08, సి.సింధు కావ్య 9.03, ఆర్. బిందు ప్రియ 8.95, సీఎస్‌సీ డీఎస్ లో పి.జి రాజేశ్వర్‌రెడ్డి 9.21, షేక్ షబానా 9.15, ఆర్.కేథారేశ్వరి 9.15, సివిల్‌లో యు.ఎస్. రెహానా 9.13, ఏఐ విభాగంలో పద్మ చందన 9.00, ఎం.నాగజ్యోతి 8.85 శాతం మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించారు.

చినుకు పడితే.. ఆ రోడ్డు చెరువే


రహదారిపై నిలిచిన వర్షం నీరు

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల పట్టణ శివారులో ప్రధాన రహదారి పరిస్థితి అధ్వాన్నంగా తయారయింది. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి మైదుకూరు రోడ్డులో రైస్‌మిల్ దగ్గర రోడ్డుపై నీరు నిలబడి కుంటను తలపిస్తోంది. వాహనదారులు, పాదచారులు ఈ రోడ్డు మార్గాన వెళ్లాలంటే హడలెత్తుతున్నారు. అలాగే అంబేడ్కర్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండు, సాయిబాబ ఆలయం దగ్గర నీరు నిలవడం వలన పాదచారులకు, వాహన దారులు అవస్థలు పడుతున్నారు. అధికారులు వర్షపునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

జాగ్రత్తలతోనే అంటు వ్యాధులు దూరం

చాపాడు : జాగ్రత్తలు పాటించటం వలన హెచ్ఐ, ఎయిడ్స్, టీబీ లాంటి అంటు వ్యాధులకు దూరమవుతాయని వైద్యాధికారి డా.శ్రీవాణి అన్నారు. మండలంలోని చియ్యపాడులో ఆరోగ్య కేంద్రంలో బుధవారం చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్, టీబీ వ్యాధుల వ్యాప్తి, వాటి నివారణపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శ్రీవాణి మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్, టీబీ వ్యాధి గ్రస్తులను చిన్న చూపు చూడవద్దని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శివ ప్రసాద్, లింక్ వర్కర్ స్కీమ్ సూపర్‌వైజర్ దర్బార్, ఏఎన్ఎంలు గ్రేసమ్మ, సునీత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దాతల సహకారం ప్రశంసనీయం


ఆలయ ముఖద్వారం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాత మార్కెట్‌లోని చెన్నకేశవస్వామి ఆలయ మరమ్మతులకు దాతలు సహకరించడం ప్రశంసనీయమని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీమహాలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి ఆలయ ముఖద్వారాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని పలువురు దాతల నుంచి రూ.50 లక్షలు సేకరించి దసరా ఉత్సవ కమిటీ వారు చెన్నకేశవస్వామి ఆలయంలో మరమ్మతులు చేయించడం ప్రశంసనీయమని కొనియాడారు. కార్యక్రమానికి సహకరించిన దాతలను ఈ సందర్భంగా అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, నాయకులు ఈవీ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

వర్షం.. హర్షం

కొంతకాలంగా ముఖం చాటేసిన వరుణుడు ఎట్టకేలకు కరుణచూపాడు. నెల రోజులుగా వర్షం లేకపోవడంతో కరువు ఛాయలు అలుముకున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో పత్తి, పసుపు, కంది, అరటి, వరి, మినుము, మిరప, మొక్కజొన్న తదితర పంటలను సాగు చేశారు రైతులు. చినుకు జాడ లేకపోవడంతో పంటలు ఎండుముఖం పట్టాయి. మండలంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షం పంటలకు ప్రాణం పోసినట్లయింది. నేల వాలిన మొక్కలు వర్షపు చినుకులకు నిగనిగ లాడుతున్నాయి. కొన్ని చోట్ల పంట పొలాల్లో నీరు నిలిచింది. నీటిని తొలగించేందుకు అన్నదాత ఉపక్రమించాడు.

- రాజుపాళెం


పత్తిపంటలో నిలిచిన వర్షం నీరు


టంగుటూరులో కళకళలాడుతున్న అరటిపంట


పత్తిపంటలో వర్షం నీటిని తొలగిస్తున్న రైతులు